


# వాగ్దానం

ప్రథమ సమావేశంలోనే ప్రథమానుభవంలోనే కుమారి అలాంటి కోర్కెను వెలిబుచ్చుతుందని గాని, అటువంటి వాగ్దానాన్ని అడుగుతుందనిగాని గోపాలం అనుకోలేదు. కాని ఆమె తన కోమల హస్తాలతో తన చంపల్ని సున్నితంగా తాకుతూ, సగం మూసిన కనురెప్పల్తో పెదిమల్ని కదిలించకుండానే -

'నాదో కోర్కె వుంది, తీరుస్తారా?' అన్నప్పుడు గోపాలం ఏమాత్రం ఆలోచించకుండానే 'అంతకన్నానా' అనేశాడు.

అంతే! ఆమె కోర్కెను వెలిబుచ్చింది. తను అంధప్రాయంగా ముంచెత్తే మైకంలో 'సరే' అన్నాడు.

ఓ ఐదు నిముషాల ముందు లేక ఐదు నిముషాల తరువాత కుమారి కోర్కెను తెలియబరిచి వుంటే తను ఏం జవాబిచ్చివుండేవాడు.

'అవును ఏం చెప్పి వుండేవాణ్ని' - గోపాలం గట్టిగా పళ్ళు బిగించి కాలితో ముందున్న టేబిలును బలంగా తన్ని లేచి నుంచున్నాడు.

శరీరాన్ని ఎవరో సూదులతో గుచ్చుతూన్నట్టూ గుండెను బలంగా గుప్పెట్లో చిక్కించుకుని

బయటికి లాగుతున్నట్టూ, మనస్సు మీదా తన అన్ని అవయవాల మీదా తన పట్టు, అధికారం సడలి పోతున్నట్టూ అతనికి తోచింది.

'పిచ్చెత్తుతుందా? యీ ఆడవాళ్ళంతా...కుమారి – '

వుద్రేకంలో అప్రయత్నంగా వెడలిన బూతు ముక్కల్ని మధ్యలోనే మింగి కుడిచేత్తో గట్టిగా జుట్టు పీక్కుని, ఎడమ చేత్తో కిటికీ చువ్వ పట్టుకుని బయటకు చూస్తూ నిలబడ్డాడు.

బజారులో ఎదురుగా వున్న కిల్లీ దుకాణంలో సిగరెట్టు పెట్టెకొని అగ్గిపుల్ల గీసి సిగరెట్టు ముట్టిస్తున్నాడో నడికారు వ్యక్తి.

గోపాలం అతని వంక ఓ నిముషం చూసి, 'బహుశా యితనికి పెళ్ళాం వుండి వుండదు. ఒకవేళ వున్నా కుమారి లాంటిదై వుండదు' అనుకున్నాడు.

ఏదో వేళకు అన్నం వండి, నీళ్లు తోడి ప్రకృతి ధర్మాన్ని నెరవేర్చేందుకు తయారుగా వుండే స్త్రీలు భార్యలుగా దొరికిన వాళ్ళు ఎంత అదృష్టవంతులు! తమ నిండు పాతిక సంవత్సరాలు ఏ నీతి బోధకులా, ధర్మోపన్యాసకులా గొడవ లేకుండా స్వేచ్ఛగా కాలం గడిపి హఠాత్తుగా వివాహం పేరుతో యీ కుమారిని ఎందుకు తెచ్చుకున్నట్టు?

భార్య కోర్కెలు చెప్పడంలోగాని, వాగ్దానాలు అడగడంలోగాని గోపాలానికి ఏమీ బాధ లేదు. ఆమాట కొస్తే తనూ ఆమె నుంచి అడిగిన వాగ్దానాలు, ఆశించిన విజయాలు కొన్ని వున్నై. అవన్నీ తను సాఫీగా, కాళ్ళూ చేతులూ, మనస్సు – ఒక్క మాటలో దేహం మామూలు స్థితిలో వున్నప్పుడు తాపీగా అడిగాడు. కాని కుమారి తన నుంచి ఆశించి సరే అనిపించిన ఆ భయంకర వాగ్దానం తను ఎలాంటి దశలో వున్నప్పుడు...?

ఏమరుపాటుగా వున్నప్పుడు ఏ హెచ్చరికా యివ్వకుండా వెన్నులో పొడిచే శత్రువుకూ ఆమెకూ అతడి దృష్టిలో తేడా కనపడలేదు. తనెవరో కూడా తనే చెప్పలేని దశలో స్వర్గమంటే మరెక్కడో వున్నదనీ, బ్రహ్మానందమనేది యింతకంటె భిన్నమైందనీ, మానవ జీవితంలో దీనికంటె ఆశించదగిందీ, కోరదగిందీ మరేదైనా వున్నదనీ, నిలువునా ఆ దేవదేవుడు దిగివచ్చి చెప్పినా, అంగీకరించడానికిగాని, కనీసం ఆ మాటలు వినడానికిగాని తనకు శక్తి, ఆలోచించే జ్ఞానం లేని ఆ తన్మయావస్థలో నిర్వికల్ప సమాధిలో, తను మైమరచి వుండగా 'నాదో కోర్కె వుంది! తీరుస్తారా!' అంటూ తన సన్నని వేళ్ళతో చంపల్ని తాకుతూ, మెరిసే కళ్ళతో తన కళ్ళలోకి చూస్తూ గులాబీ రేకుల్లాంటి పెదిమల్లోంచి 'అయితే సిగరెట్టు మానేయండి!' అంటే తను 'సరే' అనక మరో విధమైన ప్రత్యుత్తరం ఎలా యివ్వగలడు?

'ఇది పచ్చి మోసం, క్లోరోఫారం యిచ్చి కట్టుగుడ్డల దగ్గర'నుంచి దొంగిలించే తత్వం కంటే కూడా ఘోరమైంది. మగవాడు ఎప్పుడు మగవాడు కాకుండా పోతాడో గ్రహించి అతణ్ని శాశ్వతంగా అధోలోకానికి తొక్కేందుకు స్త్రీలు కనిపెట్టిన కపటవిద్య! కుటిలనీతి!

అయితే యిప్పుడు తను చేయవలసిందేమిటి? కుమారికి తను చేసిన వాగ్దానాన్ని భంగపుచ్చటమా? అగ్గిపుల్లతో కాలుస్తున్నట్టు బాధపెట్టే గుండెను క్షణక్షణానికీ అధికమౌతున్న నరాల బలహీన

తనీ ఎంత తొక్కి పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నా ఆగకుండా తిరగబడుతూ గదిలోని ప్రతి వస్తువు వుపకరణాన్నీ పగలకొట్టు! విరగకొట్టు అంటూ ప్రోత్సహించే మనసునీ, వుద్రేకాన్నీ అణచుకునేందుకు తను చేసే విఫలప్రయత్నాన్ని తలచుకుని గోపాలం మరోమారు జుట్టు రెండు చేతుల్తో గట్టిగా పీక్కుని, తలను కణతల దగ్గిర గట్టిగా పట్టుకుని కుర్చీలో నిస్పృహతో, నిరాశతో కూలిపోయాడు.

తను కుమారి కోర్కెకు సరే అని తలవూపి, సిగరెట్టు తాగడం మానేసిన యీ వారం రోజుల్లో ఎంత యమయాతన పడ్డాడు. చిన్నప్పటినుంచీ ఎంతో ముద్దుగా లాలించి భుజాన వేసుకుని తిరిగిన ఆ చిట్టి తమ్ముణ్ని 'వదినెప్పుడొస్తుంది' అన్నందుకు తను ఆపుకోలేని వుద్రేకంలో అనవసరంగా ఆ వుదయమే కొట్టాడు.

'అన్నయ్య దగ్గిర అనవసరంగా వదినె విషయం తేబోకు. ఆవిడ లేదని చాలా దిగులు పడ్డట్టుంది' అని అమ్మ తన తమ్ముడికి నడవాలో సలహా యిస్తున్నప్పుడు, తనకు నవ్వూ ఏడుపూ రెండూ వచ్చినై.

గోపాలం గడిచిపోయిన తన జీవితంలోని ముఖ్య సంఘటనల్ని తిరగవేస్తున్నాడు.

తను పదహారు సంవత్సరాల వయసులో వుండగా తండ్రి తనచేత సిగరెట్లు మాన్పించేందుకు గట్టి ప్రయత్నం చేశాడు. అసలు సిగరెట్టు తన జీవితాన్ని ఎన్నో ఒడిదుడుకుల్లో పెట్టింది. కాని అదే తనని అనేక మానసిక బాధల్నుంచి కాపాడి గట్టెక్కించింది.

'నీవు సిగరెట్లన్నా మానుకోవాలి. లేకపోతే యీ యింట్లోనుంచి బయటికన్నా వెళ్ళిపోవాలి' అని తండ్రి గట్టిగా గద్దించి చెప్పినప్పుడు తనేమి మాట్టాడకుండా నాలుగైదు రోజులు అది సాధ్యమేమో అని ప్రయత్నం చేశాడు. కాని అది తనకు యీ ప్రస్తుత జీవితంలో దుస్సాధ్యమని తెలిసినప్పుడు, ఎవరితోనూ మాటమాత్రం కూడా చెప్పకుండా ఓ నడిరాత్రి హఠాత్తుగా యిల్లు వదిలి దేశాల మీదికి వెళ్ళిపోయాడు. తరువాత బ్రతుకు తెరువు కోసం తను చేసిన ఉద్యోగాలు పడ్డపాట్లు తలుచుకుంటే .....

గోపాలం యిక ఏమాత్రం వూహించలేకపోయాడు. జరిగిపోయిన ఆ అనుభవాల్ని, ఓ సిగరెట్టు చేతులో లేకుండా ఎన్నడూ తరచి చూడలేదు. మనస్సు స్వాస్థ్యాన్ని కోల్పోకుండా వుంచుకోవాలంటే ఎన్నాళ్ళ నుంచో తను అనుమానిస్తున్న ఆ హృద్రోగం బయలుపడకుండా వుండాలంటే తను ఆ గతాన్ని పూర్తిగా మర్చిపోవాలి. లేదా అది కలిగించే నిస్పృహనీ, సిగ్గునీ తన అసమర్ధతనీ కప్పిపుచ్చుకోవాలంటే కనీసం అందుకు ప్రయత్నం చేయాలంటే తన అన్ని బలహీనతల్ని, బాధల్నీ మరపించే ఆ సిగరెట్టు చేతులో వుండి తనకు ధైర్యం కలిగిస్తూ వుండాలి.

తండ్రి తనను సిగరెట్టు మానడమా, లేక యిల్లు వదిలిపోవడమా, నిర్ణయించుకోమన్నప్పుడు – అవసరమైన ఏ మర్యాదా చూపెట్టలేదు – ఏ ప్రత్యేక వాత్సల్యాన్నీ కనపరచలేదు. ముక్కుకు సూటిగా, మార్గం – మార్గాంతరం కూడా కనబరిచాడు. యుద్ధకాలంలో కొన్న ఆ ప్రైజుబాండు యాభై వేల రూపాయల బహుమానాన్ని గెలవగానే – తనను వెతుక్కుంటూవచ్చి ఎంతో ప్రేమతో కళ్ళనీళ్ళతో తిరిగి యింటికి ఆహ్వానించాడు. అవును ఎంతయినా రక్తసంబంధం! కనిపెంచిన

వాత్సల్యం!

కాని – కుమారి! అంతా పచ్చి దగా! మన మైమరపునూ, బలహీనాన్ని వుపయోగించుకుని, యిరుకున పెట్టడం! వారం రోజులనాడు తన జీవితమార్గంలో ఎదురైన యీమెకు – తన నుంచి అసంభవమైన కోర్కెలు కోరడానికిగాని, వాటిని సాధించేందుకు, అలాంటి కృత్రిమ మార్గాలని అవలంబించేందుకుగాని, హక్కు ఎక్కడిది?

గోపాలం కుర్చీలోనుంచి లేచి తలుపు వైపుకు రెండడుగులు వేసి ఆగాడు. అందమైన కుమారి రూపమూ, ఎంతో ప్రేమతో, లాలిస్తూ ఆమె తన నుంచి కోరిన ఆ వాగ్దానమూ, తను ఆమెతో పొందిన సౌఖ్యమూ – అన్నీ అతడి మనోనేత్రమందు కదిలినై.

'యిచ్చిన వాగ్దానాన్ని భంగపుచ్చుతున్నావా? ఆమె తెలుసుకున్న తరవాత ఏమనుకుంటుంది?'

గోపాలం మళ్లీ ఓమారు జుట్టు పీక్కున్నాడు. తిరిగి గుండెల్లో మంటా, నరాలు ఎవరో పట్కారుతో గుంజుతున్నట్టు బాధా అతడికి కలిగింది.

యిలాగే కొంతకాలం జరిగితే పిచ్చెత్తుతుంది. చేసిన వాగ్దానంలో వున్న మంచి చెడ్డలూ, ఆమెకు తెలిస్తే రాబోయే ఫలితాలూ – అన్నీ నిదానంగా ఓ సిగరెట్టు ముట్టించి శాంతంగా ఆలోచించాలి. అసలు నా నుంచి ఆమె వాగ్దానం కోరినప్పటి పరిస్థితీ...అంతా తరవాత, ఓ సిగరెట్టు ముట్టించి శాంతంగా, సాఫ్‌గా....

గోపాలం తలుపు తీసుకుని ఎదురుగావున్న కిల్లీ దుకాణం వైపుకు నడుస్తున్నాడు. అతడి దృష్టి రోడ్డు మీద అటూ యిటూ పోతున్న జనంమీద గాని, బళ్ళూ, కార్లమీద గాని లేదు. తనకు ఎదురుగావున్న ఆ కిల్లీ కొట్లో, ఆ పక్కన....ఆ అరలో....

'అభినందనలోయ్! అభినందనలు!'

గోపాలం జేబులోనుంచి డబ్బులు తీస్తూ సిగరెట్టు పెట్టె కొట్టువాణ్ని అడగబోయే సమయానికి వెనుక నుంచి యీ అభినందనలూ, వాటి సొంతదారుడి చేతులూ గట్టిగా భుజం పట్టుకున్నాయి. గోపాలం వెనక్కి తిరిగాడు. శర్మ!

"అభినందనాలు ఎందుకు?" – గోపాలం జేబులో చెయ్యి అలాగే వుంచి అడిగాడు.

"సిగరెట్టు మానేసినందుకు. యింత గొప్ప త్యాగాన్ని నీచేత చేయించిన ఆవిడ – నీ భార్యను కూడా తప్పక అభినందించాల్సిందే. ఆడవాళ్ళు అందులో ముఖ్యంగా భార్యలు, వాళ్ళల్లో వింతశక్తి వుంది!"

గోపాలానికి శర్మ ముక్కు మీద బలంగా గుద్దాలనీ, ఆ కిల్లీ దుకాణం కప్పు మీదకు ఎక్కి యీ లోకంలో ఆడవాళ్ళ శక్తి అనబడేదంతా మొనగాడి బలహీనతలోనే వుందనీ, పడక గదిలో వాళ్ళు కొండల్ని ఎత్తగలిగినా, ఆ ఆవరణ దాటితే పూచిక పుల్లకూడా కదిలించలేరు అనే సత్యాన్ని ఎలుగెత్తి చాటాలన్నంత వుద్రేకం కలిగింది.

గోపాలం తనలో రేగుతున్న తుపానును బయట పడకుండా చేసేందుకు గట్టి ప్రయత్నం చేశాడు.

శర్మ ఓ సిగరెట్ ముట్టిస్తూ అడిగాడు – "ఏం! సిగరెట్టు కావాలా?"

గోపాలం మాట్లాడలేదు. జేబులోనుంచి అతడి చేయి అప్రయత్నంగా బయటకు వచ్చేసింది. స్నేహితులూ, బంధువులూ – ఆఖరికి తను ఎంతో సౌఖ్యాన్ని ఆశించి కట్టుకున్న భార్యా అంతా తన మీద కుట్ర పన్నుతున్నట్టు తోచింది.

"కిల్లీ యిదుగోనోయ్! నిజంగా ఆడవాళ్ళల్లో వున్న శక్తి అపారం! మగవాణ్ని నాశనం చేసేశక్తి బాగుచేసే శక్తి కూడా వాళ్ళలోనే వుంది. నీ విషయం చూడు..."

శర్మ అంతటితో ఆగిపోయాడు. మౌనంగా నేల వంక చూస్తూ నిలబడ్డ గోపాలాన్ని చూసి అతడు ఆశ్చర్యపడ్డాడు. కాని మరునిముషానికే అతనికి కారణం తెలిసినట్టయింది. అతడు గోపాలం చెయ్యి పట్టుకొని ముందుకు నడుపుతూ అన్నాడు.

"ఏవో తీయని కలలు కంటూన్నట్టుంది. యింకా వారమైనా కాలేదు. అప్పుడే అంత వియోగ బాధపడడం ప్రారంభిస్తే ఎలాగోయ్! పార్కుకు వెళ్దాం పద!"

గోపాలం మౌనంగా శర్మను అనుసరించాడు. శర్మ మాత్రం దారిపొడుగునా స్త్రీలను గురించీ – ముఖ్యంగా వాళ్ళల్లో తెలివిగల స్త్రీలు, పురుషుల్ని ఎలా వుద్ధరించగలరో, వుదాహరణలతో మాట్లాడేస్తున్నాడు. గోపాలం మాత్రం అన్నిటికీ మౌనంగా తల వూపుతూ, శర్మ సిగరెట్టు ముట్టించ డాన్నీ, అతడు ప్రశాంతంగా వదులుతున్న పొగనీ చూస్తూ నడుస్తున్నాడు. అతడి మస్తిష్కం పనిచేయడం మానింది. ఏదో గుండెల్లో మంటా, తను చేజేతులా ఓ అమూల్యవస్తువును వదలుకున్నా ననే దిగులూ, అతణ్ని కలతపెడుతోంది.

ఇద్దరూ మెత్తని పచ్చిగడ్డి మీద కూర్చున్నారు. గోపాలం దృష్టి ఎదురుగావున్న క్రోటన్సు మీద పడింది. పక్క యిద్దరు – ఓ స్త్రీ, ఓ పురుషుడూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. స్త్రీ తను రిస్టు వాచీ పెట్టుకున్న చేత్తో ఎత్తుగా పెరిగిన పచ్చగడ్డి పరకల్ని వేలికి చుట్టుకుంటూ మధ్యమధ్య బిగ్గరగా నవ్వుతూ మాట్లాడుతోంది. పురుషుడు మాటిమాటికి సిగరెట్టు పొగను నోటినిండా పీల్చి ఎదురుగా గుప్ అని వదుల్తూ ఏదో అంటున్నాడు.

గోపాలం ఆ దృశ్యాన్ని ఓ నిముషం ఆశగా, వింతగా చూసి తల వంచుకున్నాడు. కుమారి ఆ స్త్రీలో ఎన్నోవంతు విలువ చేస్తుంది?

"నిజంగా మా ఆవిడ నిన్నూ, నీ భార్యనూ మెచ్చుకోలేక సతమతమౌతుందోయ్"– శర్మ వీపు తడుతూ అన్నాడు.

"ఎందుకు?" – గోపాలం ప్రశ్నించాడు. కాని అతడికి ఆ ప్రశ్న అడగాలని లేదు.

"ఎందుకేమిటి? ఆమె నీచేత చేయించిన ఈ త్యాగం! మనం ఎంతగా స్త్రీని ప్రేమించకపోతే వాళ్ళ కోర్కెల్ని తీర్చేందుకు వొప్పుకుంటాము?"

గోపాలం తల ఎత్తి శర్మ వంక చూచాడు. అతడు మరో సిగరెట్టు ముట్టించేందుకు అగ్గిపుల్ల గీస్తున్నాడు.

"అయితే మీ ఆవిడ నిన్ను సిగరెట్టు మానమని ఎప్పుడూ అడగలేదా?" – శర్మ గట్టిగా పొగ

వదిలి, ఓ క్షణకాలం రేడియో పాట విని అన్నాడు.

"అడిగింది! కాని ఏం లాభం? చాల ఆలస్యంగా. తెలివి తక్కువ మొద్దు!"

"అంటే?"

"ఆరు నెల్ల కాపరం తరవాత నెల గడచిందని చెప్తూ 'మీరు సిగరెట్టు మానేయండి!' అన్నది. మొదట చెప్పిన సమాచారంతోనే గుండెలు అలిసి, కుచేలోపాఖ్యానం నెమరుకు తెచ్చుకుంటున్న నాకు ఆమె వెలిబుచ్చిన ఆ కోర్కె వళ్ళు మరిచేట్టు చేసింది. నోరు మూయమన్నాను. యింతకీ తెలివి తక్కువ దద్దమ్మ!"

హఠాత్తుగా రేడియో గొంతు పెద్దది చేసింది. పాడే వాళ్ళని పరిచయం చేస్తూ ప్రథమంలో చెప్పబడే రేడియో సూత్రధారుడి మాటలు వినబడలేదు గనక, ఆ పాడేది స్త్రీయో, పురుషుడో చెప్పడం అసంభవం. కాని పాట....నను బ్రోవమని చెప్పవే సీత....చొక్కియుండెడివేళ....

మిత్రులిద్దరూ ఓ ఐదు నిముషాలు నిశ్శబ్దంగా పాట విన్నారు. హఠాత్తుగా గోపాలానికి కడుపులో ఎవరో చెయ్యి పెట్టి దేవినట్టూ డోకు బయటపడడానికి ప్రయత్నం చేస్తున్నట్టు తోచింది. జేబుగుడ్డ నోటికి అడ్డంగా పెట్టుకుని లేస్తూ –

"వెళ్తానోయ్. యింటి దగ్గిర కాస్తపని వుంది" అన్నాడు.

"అయితే పదహారు రోజుల పండక్కి ఎప్పుడెల్తావ్?"

"యివ్వాళే ఏడు'గంటల బండికి"

"అయితే యిప్పుడప్పుడే కలుసుకునేది లేదన్నమాట"

అప్పటికే ఓ పది గజాల దూరం నడిచిన గోపాలం యిచ్చిన జవాబు శర్మకు వినబడలేదు. 'అదృష్టవంతుడు! ఎంత తెలివిగల భార్యలు' అని దీర్ఘంగా నిట్టూర్చిన శర్మ మాటలూ, ఆ నిట్టూర్పూ గోపాలం చూడలేదు.

❀ ❀ ❀

రైలు బయలుదేరేందుకు యింకా పావుగంట టైముంది.

గోపాలం టిక్కెట్టు కొని ప్లాట్‌ఫారం మీద యిటూ అటూ తిరగడం ప్రారంభించాడు. సిగరెట్టు మీద సిగరెట్టు అవిచ్ఛిన్నంగా ముట్టిస్తున్నాడు. లెదర్ బ్యాగ్‌లో ఓ మూల బలవంతంగా యిరికించిన సిగరెట్ డబ్బా, అగ్గిపెట్టే చోటు చాలక ఒకదాన్ని ఒకటి వరుసుకుని అల్లరి చేస్తున్నయ్. అతడు ఫస్టు క్లాసు కంపార్టుమెంటు ముందు ఆగి లోపలికి చూశాడు.

సూటులో వున్న ఓ యువకుడు సిగరెట్టు నోట్లో పెట్టుకుని వుండగా ఓ గిరిజాల యువతి అగ్గిపుల్ల గీసి అంటిస్తోంది.

ఏదో గొణుగుతూ గోపాలం నాలుగు గజాల ముందుకు నడిచాడు. అతడి దృష్టి మూడో క్లాసు కంపార్టుమెంటులోకి వెళ్ళింది. ఓ చొక్కా లేని యువకుడూ, ఓ రవికలేని యువతీ ఒకళ్ళెదురుగా ఒకళ్ళు కూర్చుని నిర్విచారంగా చుట్టలు తాగుతున్నారు.

గోపాలం ఆ దృశ్యం చూసి యిక అవతలకి అడుగేసేందుకు తయారవుతూన్న దశలో ఆ

యువతి గట్టిగా కాంర్రించి కిటికీలోంచి బయటకు తుపుక్కున పూసింది.

అతడు చిన్న గంతేసి ఆ ప్రమాదాన్ని దాటి, పెట్టెలో ఎక్కి కూచున్నాడు.

ఆ రెండు దృశ్యాలు అతని హృదయం మీద గట్టిగా ముద్ర గుద్దినై. సూట్లూ-ఫ్రెంచి కట్లూ, మురికి గుడ్డలూ-మాసిన గుడ్డలూ, వాటికి చాతనైనంతలో తోచిన విధంగా జీవితాలను గడిపేస్తున్నై. పోతే మల్లు చొక్కాలకి-అద్దకం చీరలకీ, వీటికీ వచ్చింది బాధంతా! వర్తి త్రిశంకు సంతానం.

గంట తరవాత, అతడు దిగవలసిన స్టేషను వచ్చేవరకు గోపాలంలో అస్పష్టంగా పరస్పర విరుద్ధంగా తోటి మానవుడు ఎవడూ అర్థం చేసుకునేందుకు వీలులేనంత గజిబిజిగా అనేక తాత్విక భావాలు పరస్పరం ఢీకొని నుగ్గునుగ్గయి దుమ్ముగా మారి గాలిలో కలిసి పోయినై. నేటి వైవాహిక వ్యవస్థ మీదా, నైతిక సూత్రాలపైనా, ఆర్థిక రాజకీయాలన్నిటి మీదా కాబొయ్యే ఓ వెయ్యిమంది పిహెచ్.డి.లకు సరిపడేంత పరిశోధన సామగ్రినీ, తార్కిక సూత్రాలనీ చర్చించి వదిలేశాడు.

రిక్షావాడికి వెళ్ళవలసిన చోటు చెప్పి, గోపాలం మరో సిగరెట్టు ముట్టించాడు. లెదర్ బ్యాగ్‌లో సిగరెట్ టిన్నూ, అగ్గిపెట్టే యింకా స్థలం కోసం పోరాడుతూనే వున్నై.

అతణ్ని ఒకే ఒక ప్రశ్న! ఆ ఆకాశాన్నీ భూమినీ కలిపి పట్టుకోగలిగినంత పెద్ద ప్రశ్న బాధ పెడుతోంది. కుమారి తను మళ్ళీ సిగరెట్లు తాగుతున్నాడనేది తెలుసుకున్నప్పుడు తనను గురించి ఏమనుకుంటుంది?

ఆ ప్రశ్నను మననం చేసేకుంటూనే అతడు రిక్షా దిగాడు. బావమరిది తలుపు తీయగా, తను యింట్లోకి అడుగు పెడుతూన్నప్పుడు, లెదర్‌బ్యాగ్ తలుపుకు కొట్టుకుని, అందులోవున్న సిగరెట్టు టిన్ను గట్టిగా శబ్దం చేసినప్పుడు, అతడికి గుండెలు ఆగిపోయినంత బాధ కలిగింది.

భోజనం చేసి గోపాలం గదిలో ప్రవేశించాడు. అంతా వుక్కగా వుంది. గాలి కోసం దక్షిణవైపు కిటికీ తెరిచాడు. చల్లని గాలి విసురుగా లోపల ప్రవేశించింది. కాని బయట అంతా చీకటి, కారుచీకటి!

సిగరెట్టు ముట్టిద్దామనుకున్నాడు. కాని అతడికి ధైర్యం చాలలేదు. తండ్రినీ, విధినీ, ధిక్కరించి, పది సంవత్సరాలు బాధలు పడినా, భయమనేది లేకుండా బతికిన తనకు వారం రోజులనాడు తన జీవితములో ప్రవేశించిన కుమారి అంటే అంత బెదురు, వణుకూ ఎందుకు కలుగుతున్నై? శర్మ చెప్పిందాంట్లో కొంత నిజం వుంది!

"నాకేం తెచ్చారు?"

గోపాలం వెనక్కి తిరిగి చూశాడు. వెన్నెల గదిలో ప్రవేశిస్తున్నట్టు అతనికి తోచింది. దిగంబరత్వం కూడా సిగ్గుతో తలవంచుకోవలసినంత సన్నని వూదారంగు చీరతో, కుమారి గదిలో ప్రవేశించింది.

"నాకేం తెచ్చారు?" - మెరుపుల్లాంటి కళ్ళతో, అద్దాలను తొలగతోసుకుని తొంగిచూస్తున్న అవయ సౌష్ఠవంతో ఆమె మళ్ళీ ప్రశ్నించింది.

గోపాలం జవాబు చెప్పలేకపోయాడు. అతడి గొంతులో ఏదో అడ్డుపడి వుక్కిరిబిక్కిరి చేస్తోంది.

కుమారి ఆతృతగా టేబిల్ మీదవున్న లెదర్‌బ్యాగ్ వైపుకు నడిచింది.

గోపాలం పందిరి మంచం జోడు పూతగా పట్టుకుని, గొంతులోనుంచి బయటపడేందుకు భయంకరంగా పెనుగులాడుతున్న ఏదో మాటను, ఆపుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడు.

ఆమె వుత్సాహంతో బ్యాగ్‌క్లిప్పు పక్కకు లోపల చెయ్యి పెట్టబోయింది. స్వేచ్ఛ కోసం పెనుగులాడుతున్న సిగరెట్టు టిన్నూ, అగ్గిపెట్టె ఒక్క వూపుతో బయటకు దూకి, గచ్చుమీద గల్లంతుచేస్సినై.

గోపాలం గొంతులోనుంచే ఓ అమానుషమైన ధ్వని బయటపడింది. ఆ ధ్వనిని యీనాటి మానవుడెవడూ చేయలేడు - కనీసం అనుకరించనైనా అనుకరించలేడు. బహుశా లక్ష కోట్ల సంవత్సరాలకు పూర్వం వురుములూ, మెరుపులూ, పెను తుపానులకూ భయపడిన, మానవ పశువు నోటినుండి, అలాంటి ధ్వని వెలువడి వుండొచ్చు.

కుమారి నిశ్చేష్టితంగా ఓ క్షణకాలం తల వంచుకున్నది. తరవాత తలెత్తి ఓమారు భర్త వంకా, సిగరెట్టు టిన్ను వంకా చూసి కొంచెం కొంచెంగా నుంచున్న చోటునే కూలబడి పోయింది.

గోపాలం ఆ పందిరి మంచాన్ని యింకా దట్టిగా పట్టుకుని, "క్షమించు కుమారి! మానలేక పోయాను" అన్నాడు.

కుమారి తలెత్తి అతడి వంక చూసింది. అమె నరాల్లో, హృదయంలో తరతరాల నుంచి గూడు కట్టుకునివున్న ఆదిశక్తి వారసత్వం నాగరికతా, కట్టుబాట్లను ఛేదించుకుని బయటపడేందుకు ప్రయత్నం చేస్తోంది. మహాకాళి బలోద్వేగాలముందు లక్ష్మీ సరస్వతుల సామరస్య, సౌశీల్యాలు ఎంత!

"యిది నమ్మించి గొంతు కోయడం! నా జీవితం నాశనమై పోయింది" - ఆమె తలతో టేబిలును గట్టిగా కొట్టింది.

గోపాలం ఆమెకు దగ్గిరగా వంగి - "క్షమించు కుమారి! యింత స్వల్పానికి...."

"స్వల్పమా? మీచేత అవి మాన్పించగలిగినందుకు అందరూ నన్ను అభినందించారు. మీరు నన్నెంతగా ప్రేమిస్తున్నారో యీ విషయం ద్వారా అందరిలో గొప్పగా చెప్పుకున్నాను. కాని యిప్పుడు"....ఆమె తిరిగి తలను టేబిలుకు కొట్టింది.

గోపాలం యింకా దగ్గిరకు జరిగి ఆమె భుజాన్ని పట్టుకోబోయాడు.

కాని కుమారి ఆ సమయంలో అతడి వంక చూసిన చూపుతో గోపాలం నిర్విణ్ణుడై లేచి నుంచున్నాడు. ఆ పడకగది అతడికి ఓ సివంగి బోనులా కనబడింది. భయంతో ఏం చేసేందుకు శక్తి లేక వణుకుతూ నిలబడ్డాడు.

"యిప్పటికైనా మానలేరా?"

"మానలేను కుమూ! మానలేను. క్షమించు!" - అతడి కాళ్ళల్లోని పట్టు సడలింది. దీనంగా కూర్చుని, తల ఓ పక్కకు వేలాడవేశాడు.

కుమారి బుసకొడుతూ లేచి నుంచున్నది.

"అయితే మిమ్మల్ని గురించి చాలామంది చెప్పింది నిజం! నా గొంతు కోశారు!"

"చాలామంది ఏం చెప్పారు?" – గోపాలం హీనస్వరంతో అడిగాడు.

"మీరు నిలకడలేని మనుషులనీ, దేశాలు పట్టుకు తిరిగే తత్వమనీ యింకా..."

"ఊఁ! యింకా...."

గోపాలంలో పది సంవత్సరాలనాడు తన తండ్రిని ఎదిరించి నిలబడగలిగిన ఆ నిర్భయత్వం, ఆత్మవిశ్వాసం తిరిగి కొద్దికొద్దిగా ప్రవేశించినట్లైంది. అతడు లేచి నుంచున్నాడు.

కుమారి తెగువతో అతడి వంక చూస్తూ నిప్పులు చెరిగే నేత్రాలతో అన్నది.

"యింకా ఏముంది! ఆ లలితతో మీ సంబంధం...."

"నోర్ముయ్!"

ఆమె యిక మాట్లాడలేదు. అక్కడే ఆ చల్లని గచ్చు'మీద ఏడుస్తూ జుట్టంతా పీక్కుంటూ కళ్ళు మూసింది.

గోపాలం నిశ్చలంగా నిర్వికారంగా, ఆ పందిరి మంచం పట్టుకుని అలాగే నుంచున్నాడు. •

కొద్ది సేపట్లో కుమారి సన్నని శబ్దం చేస్తూ గాఢనిద్రలోకి జారుకుంది.

గోడ గడియారం రెండు గంటలు కొట్టింది. దూరంగా రైలుకూత వినపడింది. గోపాలం తల పంకించి తనలో అనుకున్నాడు అది మొదలు, తరవాత అరగంటకు ప్యాసింజరు!

అతడి కళ్ళు నూతన కాంతుల్ని చిమ్మినై. పది సంవత్సరాలనాడు తనలో వుండే ఆ నిర్భయత్వం, ఎక్కడికైనా కళ్లు మూసుకుని దూకే స్వభావం, తనకు అడ్డుగా కనబడే ఎంత స్వల్ప ఆటంకాన్నయినా తీవ్రంగా ద్వేషించే తత్వం – అన్నీ క్రమక్రమంగా తనలోకి ప్రవేశిస్తున్నట్టు తోచింది.

అతడు నిర్లక్ష్యంగా గది తలుపు తెరచి బయటకు రెండడుగులు వేసి ఆగాడు. ఒక్కసారి కుమారిని ఆఖరుసారిగా చూస్తే మెరుపులాంటి ఆ కోర్కెను తీవ్రమైన అసహ్యం, ద్వేషం అడుక్కు నెట్టినై.

గోపాలం రోడ్డు మీదకి వచ్చాడు. చల్లని గాలి తీవ్రంగా వీస్తోంది.

సిగరెట్టు పెట్టె కోసం జేబులో చేయి పెట్టాడు. కాని అది లేదు. గదిలోనే మర్చిపోవడం జరిగింది. అవును, అన్నీ అక్కడే మర్చిపోవాలి. తిరిగి వెళ్ళడమనే ప్రశ్న లేదు. దూరంగా రైలు కూత వినపడింది, ప్యాసంజరై వుంటుంది.

గోపాలం పరిగెత్తడం ప్రారంభించాడు. టిక్కెట్టు విషయం గుర్తుకొచ్చి జేబులో పర్సు కోసం చెయ్యి పెట్టాడు. అదీ లేదు. దాన్నీ అక్కడే! అక్కడే!..... ఆ గదిలోనే వదిలి పెట్టడం జరిగింది.

ఫరవాలేదు. పది సంవత్సరాల నాడు ఇలాగే ఆ స్వేచ్ఛ కోసమే పరుగెత్తాడు. అప్పుడూ పర్సు లేదు.

అతడు వేగాన్ని హెచ్చించాడు. చల్లని స్వేచ్ఛా వాయువులు గోపాలాన్ని యింకా యింకా ముందుకు నెట్టుతున్నై.

❋

*(రేరాణి మాసపత్రిక : 1940–49 మధ్య)*